

సాక్షి బాపట్ల

బుధవారం, 9, అక్టోబర్, 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,523 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,221 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన ఎస్పీ



బాపట్లటౌన్ : ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వ్యక్తిగత పర్యటన నిమిత్తం పాండురంగాపురం గోల్డెన్ రిసార్ట్స్‌లో బస చేశారు. మంగళవారం పర్యటన ముగించుకొని వెళ్తుండగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మర్యాద పూర్వకంగా కలిశారు.

సాయిబాబా పాదాలను తాకిన సూర్యకిరణాలు



పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో మంగళవారం ఓ ఘటన భక్తులను తరింపజేసింది. గ్రామంలోని వేంచేసియున్న షిర్డి సాయిబాబా మందిరంలో ఉదయం సూర్యకిరణాలు నేరుగా బాబా మూలవిరాట్ విగ్రహాన్ని పాదాల వద్ద తాకాయి. బాబా విగ్రహం చెంత అద్భుత ఘటనను చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో మంగళవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో ఆరో రోజు మహాలక్ష్మీదేవిగా భక్తు ల పూజలందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసుర మర్దని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కోదండరామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం–గుంటూరు తరలింపు



బాపట్లటౌన్/కాకుమాను: రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలైన సంఘటన మండలంలోని జమ్ములపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన 15 మంది మంగళవారం కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం సూర్యలంక సముద్రస్నానం చేసేందుకు బయల్దేరారు. మార్గంమధ్యలో రేటూరు–జమ్ములపాలెం మధ్యలో జిల్లెళ్లమూడి సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న నాగేంద్రం, లక్ష్మీపార్వతి, అన్నపూర్ణ, నాగేశ్వరరావు, ఎం.లక్ష్మి, వి.రాఘవ, వి.వెంకటేశ్వరమ్మ, వి.తిరుపతిస్వామి, వి.పల్లవి, వి.సౌజన్య, ఎం.మనస్విని, ఎం.సుప్రియలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాధితులను 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎం.లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. మిగిలిన క్షతగాత్రులంతా బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రూరల్ సీఐ గంగాధరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణమ్మకు హారతులు ఇస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ

శ్రీపీఠే..సురపూజితే!

- శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు
- నేడు సరస్వతీదేవిగా అమ్మవారికి విశేష అలంకరణ
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు శక్తుల్లో ఒక శక్తి మహాలక్ష్మీదేవి. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్మిలుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమిష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ మంగళవారం భక్తులను కరుణించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించిన అనంతరం నిత్య పూజలు చేశారు. ఆలయ ఈఓ, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రూ.500 టికెట్లపై భక్తుల ఆగ్రహం

రూ.500 టికెట్ల విక్రయంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటలు పడితే రూ.300, రూ.100తోపాటు సర్వ దర్శనం గంటలోనే పూర్తవుతోందని తెలంగాణ నుంచి విచ్చేసిన భక్తులు పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో డీజీపీ

శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు సీఎం పర్యటన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్ల గురించి సీపీ రాజశేఖర్‌బాబును డీజీపీ అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు.



ఆరో రోజు రూ.57.18 లక్షల ఆదాయం

దసరా ఉత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం దేవస్థానానికి రూ.57.18 లక్షల ఆదాయం లభించింది.

కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఇంద్రకీలాద్రికి చేరుకోగా దుర్గగుడి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, డీఈఓ రత్నరాజు, ఆలయ అర్చకులకు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని అందజేశారు. దుర్గగుడి తరఫున ఈఓ రామరావు అమ్మవారి ప్రసాదాలను కాణిపాకం దేవస్థాన అధికారులకు అందజేశారు. అన్నవరంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు

అన్నవరం ఆలయం నుంచి..

అన్నవరం ఆలయ ఈఓ రామచంద్రమోహన్ దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గగుడి అధికారులకు పట్టువస్త్రాలు అందజేశారు.

నేడు మూలా నక్షత్రం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. అత్యంత కీలకమైన అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం దుర్గమ్మను శ్రీ సరస్వతీదేవిగా అలంకరిస్తారు. అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకుని విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించాలని వేడుకునేందుకు అశేష భక్తజన కోటి మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఇంద్రకీలాద్రికి తరలివచ్చింది. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై రాత్రి నుంచి భక్తులను కంపార్టుమెంట్‌లోకి మళ్లించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది.



మూలా నక్షత్రం దర్శనం కోసం మంగళవారం అర్ధరాత్రి రోడ్డుపై వేచి ఉన్న భక్తులు

అక్రమాల కాంప్లెక్స్



నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్

- అనుమతులు లేకుండానే నిర్మాణం
- ఎమ్మెల్యే వేగేశన భూమి పూజ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.కోటికి పైగా వసూళ్లు

బాపట్ల : బాపట్ల జిల్లా కేంద్రం కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అక్రమార్కుల కన్ను ప్రభుత్వం భూములపై పడింది. అంతే నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వం స్థలంపై కన్నేశారు. ఏకంగా వాణిజ్య సముదాయంతో కూడిన కాంప్లెక్స్ నిర్మాణానికి పునాదులు వేశారు. అందుకు కొంతమంది ఉద్యోగులు అండగా నిలిచారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు భూమి పూజ చేయటంతో అధికారులు కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. కాంప్లెక్స్ నిర్మాణానికి కోటి రూపాయలకుపైగా వసూలు చేసినట్లు సమాచారం.

అక్రమ నిర్మాణం జరుగుతుంది ఇలా..

బాపట్ల పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద సర్వే నెంబరు 635/2లో 75సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో 34 సెంట్ల భూమిలో రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించారు. మిగిలిన 41 సెంట్లు ఎన్జీవో అసోసియేషన్‌కు కేటాయించారు. కొంత స్థలంలో అసోసియేషన్ కార్యాలయం నిర్మించారు. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఈ ప్రధాన రహదారిపై ఉండడం, బాపట్ల జిల్లా కేంద్రంగా మారడంతో వ్యాపార సముదాయం నిర్మించేందుకు నిర్ణయించారు. అసోసియేషన్‌కు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు ఉపయోగించరాదని తెలిసినప్పటికీ వ్యాపార దృక్పథంతో ముందుకు వచ్చారు. కాంప్లెక్స్ నిర్మాణానికి ఆగస్టు 22వ తేదీన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు భూమి పూజ చేపట్టారు. అనుతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి, అప్పటి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చర్యలు తీసుకోలేదు. దీంతో సమాచార హక్కు చట్టం కింద ఫిర్యాదు చేయగా కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు లేవని టీపీఓ మల్లికార్జున లిఖిత పూర్వకంగా ఇచ్చారు. అయినప్పటికీ చర్యలు తీసుకున్న నాథుడేలేడు.



కాంప్లెక్స్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు

రూ.కోట్లలో వసూళ్లు

నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్‌లో నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌లో షాపులు ఇస్తామని కోట్లాది రూపాయలు వసూలు చేశారు. రెండు అంతస్తులతో కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 14 షాపులు, మొదటి అంతస్తులో 10 షాపుల నిర్మాణం చేపట్టారు. ఒక్కొక్క షాపునకు రూ.2లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు అద్దె కూడా వేలల్లో వసూలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

అధికారుల తీరుపై అనుమానాలు



అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌పై ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు. కొంతమందికి ముడుపులు ముట్టడంతో మౌనంగా ఉన్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ నిర్మాణంపై న్యాయపోరాటానికైనా సిద్ధంగా ఉన్నాను.

–జోగి రాజా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు

అనుమతులు లేవు



పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద నిర్మిస్తున్న వాణిజ్య సముదాయానికి ఎటువంటి అనుమతులు లేవు. ఈ విషయాన్ని ఈ పాటికే వారి దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం సరికాదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–మల్లికార్జున, టీపీఓ

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

- విజన్ 2047 ద్వారా జిల్లా అభివృద్ధి
- ప్రత్యేక ప్రణాళిక కోసం ప్రజాప్రతినిధులు,అధికారుల చర్చ
- త్వరలో ప్రభుత్వానికి నివేదన
- విలేకరుల సమావేశంలో మంత్రులు అనగాని, గొట్టిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, పక్కన మంత్రి గొట్టిపాటి తదితరులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: భారతదేశం తరహాలో బాపట్ల జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం విజన్ 2047 ప్రణాళికను రూపొందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తోపాటు అన్ని నియోజకవర్గాల శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు జిల్లా కలెక్టర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ విజన్–2047లో భాగంగా రాబోయే అయిదేళ్లలో జిల్లాలో సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 74 కిలోమీటర్లు ఉన్న తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, వ్యవసాయ, ఆక్వా రంగాల్ని అభివృద్ధి చేయనున్నామన్నారు. చిన్న, పెద్ద పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రికి సమర్పించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించామన్నారు. జిల్లాలో బకింగ్‌హామ్ కెనాల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయం, ఆక్వాతోపాటు ఆయా రంగాలపై ఆధారపడ్డ అన్ని రంగాలను అభివృద్ధి చేస్తామన్నారు. చేనేత రంగం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అద్దంకి, మార్టూరు ప్రాంతాల్లో చిన్న పరిశ్రలతోపాటు పెద్ద పరిశ్రమలను నెలకొల్పుతామన్నారు. తద్వారా కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్నారు. విజన్ 2047తో జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి మాటాడుతూ జిల్లా వ్యవసాయరంగంలో 6వ స్థానంలో ఉండగా పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్‌లో 24వ స్థానంలో ఉందన్నారు. ఉన్న వనరులు ఉపయోగించుకొని జిల్లాను అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. అద్దంకిలో మైనింగ్, పాలీషింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసి, తీరంలో మెరైన్, టూరిజం అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చీరాలలో చేనేత అభివృద్ధి చేస్తామన్నారు. మొత్తంగా అన్నిరంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు రెండు మూడు రోజుల్లో ప్రాణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించే కార్యక్రమం చేపట్టామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎం.కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర–2047 విజన్ అభివృద్ధి ప్రయోజనకరం

బాపట్ల: స్వర్ణాంధ్ర –2047 విజన్ అభివృద్ధి రాబోయే పౌరులకు ఎంతో ప్రయోజనంగా మారనుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర – 2047 జిల్లా స్థాయి అవగాహన సదస్సు మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతతో శ్రమిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలమన్నారు. బకింగ్ హామ్ కెనాల్ అభివృద్ధి చేసుకోగలిగితే బోట్ల ద్వారా రవాణా పెరిగి ఆదాయ వనరుగా మారుతుందన్నారు. తద్వారా కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చన్నారు. 13వ శతాబ్దం నాటికి మోటుపల్లి ఓడరేవును పునః నిర్మించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. బీచ్‌ల వద్ద సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ప్రజలకు మెరుగైన జీవనం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యం, విజన్ బాపట్ల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రజల తలసరి ఆదాయం రూ.1.84 లక్షలు ఉండగా, రూ.15 లక్షలకు పెరగాలన్నారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.19,260 కోట్లు, పరిశ్రమల ద్వారా రూ.5,526 కోట్లు, సేవా రంగం ద్వారా రూ.9,549 కోట్లు ఆదాయం వస్తుందన్నారు. మొత్తంగా జిల్లా వార్షిక ఆదాయం రూ.34,336కోట్లు వస్తుందన్నారు. కేవలం వ్యవసాయరంగం ద్వారానే రూ.7,734కోట్లు వార్షికాదాయం వస్తుందన్నారు. ఖనిజ సంపద ద్వారా జిల్లాకు రూ.694 కోట్లు వార్షిక ఆదాయం లభిస్తుందన్నారు. చీరాల ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో బౌద్ధ స్తూపం, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన వివరించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ ఫలాలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించామని తెలిపారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ వ్యవసాయానికి సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. ప్రతి ఎకరాకు నీరందిస్తేనే ఇది సాధ్యమన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ చేనేత రంగాన్ని ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ ఆక్వా, పర్యాటక రంగం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మత్స్యకారుల కోసం ఇస్రో రూపొందించిన ట్రాన్స్‌పాండర్‌లను 150 మంది మత్స్యకారులకు మంత్రులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. యంత్రం పనితీరును వివరించారు. స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమంపై పాఠశాలల్లో నిర్వహించిన క్విజ్, వకృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థినిలకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కామన్‌వెల్త్ పోటీలకు సాదియా ఆల్మాస్



మంగళగిరి: ఈ నెల 8వ తేదీ నుంచి సౌతాఫ్రికా సన్ సిటీలో నిర్వహించనున్న కామన్‌వెల్త్ పోటీలకు మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్ ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధానిలు మంగళవారం తెలిపారు.

క్లుప్తంగా

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

చెరుకుపల్లి: ప్రేమించాలని బాలికను వేధించడంతోపాటు ఆమె తండ్రిని గాయపరిచిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనీల్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి కనగాల గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో రాజవోలు గ్రామానికి చెందిన కుంచల భార్గవ్‌రెడ్డి వేధించాడు. ఈ క్రమంలో తన అనుచరుడైన దొంతిబోయిన విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటికి వెళ్లాడు. బాలిక కుటుంబసభ్యులపై కత్తి, ఇనుప సుత్తితో దాడి చేశాడు. దీంతో బాధితురాలి తండ్రి గాయపడ్డాడు. ఈ కేసులో నిందితులను మంగళవారం ఉదయం గూడవల్లి రోడ్డులో పోలీసులు అరెస్టు చేశారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'ఖజానా'లో అవకతవకలపై విచారణ

చీరాల టౌన్: ఖజానాలో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టారు. పర్సంటేజీలు రాని, ప్రాధాన్యత లేని కుర్చీలను కేటాయించడంపై ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేసి బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకుండా కమీషన్ల కోసం ఇబ్బందులకు గురిచేసిన ఖజానా ఉద్యోగులపై రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎస్.మోహనరావు ఆదేశాలతో మంగళవారం చీరాల ఎస్టీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. చీరాల ఎస్టీవో కార్యాలయంలో 2021–24 సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డుల వివరాలు, ఆన్‌లైన్ సమాచారాన్ని పరిశీలించారు. అక్రమాలు, అవినీతికి పాల్పడి విధుల నుంచి సస్పెండ్ అయిన పూర్వ ఎస్టీవో భాగ్యలక్ష్మి, పూర్వ సీనియర్ అసిస్టెంట్ సుధీర, ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులు సుజాత, సోనియా, లక్ష్మి, రాజేశ్వరి, సుజాతలను పిలిపించారు. కొన్నేళ్లుగా ఈ ఉద్యోగులు చేసిన అన్ని బిల్లుల పాస్ వివరాల రికార్డులను పరిశీలించారు. వాటితో నివేదికలు తయారు చేశారు. డైరెక్టర్ ఆదేశాలతో విజయనగరం జిల్లా ఖజానా డీడీ, ఇద్దరు ఎస్టీవోలు, కర్నూలు, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల ప్రధాన ఖజానా కార్యాలయాల డీడీలు, సీనియర్ ఎస్టీవోలు బృందాలుగా ఏర్పడ్డారు. మొత్తం ఆరుగురు అధికారుల విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ వివరాలను రాష్ట్ర ఖజానా డైరెక్టర్ వెల్లడిస్తారని వారు తెలిపారు.

తల్లి మృతిని జీర్ణించుకోలేక యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: తల్లి మృతి చెందడంతో ఆ బాధతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇజ్రాయిల్‌పేటలో నివాసం ఉండే మొహమాటం లక్ష్మి (53)కి వెంకటపవన్ (34), మనోజ్‌కుమార్ సంతానం. లక్ష్మి మంగళవారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందింది. దీన్ని జీర్ణించుకోలేని పవన్ ఆమె వినియోగించే మందు బిళ్లలను మింగాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనోజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- రేపల్లె నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఆర్థికసాయం అందజేత



కార్యకర్తలకు చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

నిజాంపట్నం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రేపల్లె నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పిలుపునిచ్చారు. ఎన్నికల అనంతరం టీడీపీ గూండాల చేతిలో గాయపడిన, ఆస్తులను నష్టపోయిన కార్యకర్తలకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఒక్కొక్కరికి వచ్చిన రూ.50 వేల చెక్కులను మంగళవారం నిజాంపట్నం మండలంలో పర్యటించిన గణేష్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీ కోసం పనిచేసే వారికి నాయకత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా కార్యకర్తలకు తోడుగా ఉంటామని భరోసానిచ్చారు. కూటమి నేతల అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజా సంక్షేమం కోసం వారి సమస్యలపై నిరంతరం పోరాడతామని చెప్పారు. ఈ సందర్భంగా నిజాంపట్నం మండలం కళ్ళిఫలం గ్రామంలో టీడీపీ గూండాల చేతిలో గాయపడిన మేడికొండ నాగేంద్రబాబు, పరిస శ్రీనివాసరావులకు, ఆస్తులు నష్టపోయిన కట్టుపల్లి కిషోర్‌లకు ఒక్కొక్కరికి రూ.50 వేల వంతున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాశీ ప్రభాకరరావు, రవిరెడ్డి, పీటా నాగేశ్వరరావు, జి.రాజశేఖర్, బగ్గారెడ్డి, కేసన నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, బొర్రా నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలల భవిష్యత్తు నాశనానికి కుట్ర

జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి



కరపత్రాలను విడుదల చేస్తున్న రమేష్ రాంజీ

రేపల్లె రూరల్: మాలల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసేందుకు రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ విమర్శించారు. రేపల్లె డివిజన్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నగరం మండలం సజ్జావారిపాలెంలోని లక్ష్మీగణపతి ఫంక్షన్‌హాలులో మాలల చైతన్య సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత కరపత్రాలను మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప కులాలవారీగా వర్గీకరించి క్రిమిలేయరును అమలు పరచుకోవచ్చునని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా అంబేడ్కర్ యువజన సంఘాలు, మాల విద్యార్థులు, యువత, విద్యావంతులను చైతన్య పరిచేందుకు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం నాయకులు దోనేపాటి ప్రసాద్, మాల మహానాడు రేపల్లె నియోజకవర్గం కన్వీనర్ చల్లపల్లి కోటేశ్వరరావు, షెడ్యూల్ట్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు యన్నం సురేష్, జై భీమ్ రక్షణ సేన అధ్యక్షుడు పేర్లి మోజస్, న్యాయవాది కొనకాల ప్రసాద్, పంతగాని కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు దొంగల ముఠా అరెస్టు



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ తదితరులు

చిలకలూరిపేట: మోసాలు, దొంగతనాలు, దోపిడీలకు పాల్పడే ఐదుగురు దొంగ ముఠాను రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. మార్టూరు మండలం నాగరాజుపల్లి తండాకు చెందిన బాణావతు రాంబాబునాయక్, తన మామయ్య రామావత్ బాబునాయక్‌తో కలసి సెప్టెంబర్ 28వ తేదీన చిలకలూరిపేట గొర్రెల మండీలో తనకు సంబంధించిన 16 పొట్టేళ్లు అమ్మగా రూ.1.15 లక్షలు వచ్చాయి. అవి జేబులో పెట్టుకొని తిరిగి తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో వారిని ఎక్కడికి వెళ్లాలంటూ ఆటోలో వచ్చిన ముఠా సభ్యులు ఆటో ఎక్కించుకున్నారు. దారిలో వారిలో వారు ఆడుతున్నట్లు మూడు బిళ్లలాట ఆడేలా చేసి వారి వద్ద నుంచి రూ.17,800 లాక్కొని రామచంద్రాపురం గ్రామ పరిధిలోని మంగళపాలెం డొంక వద్ద ఆటోలో నుంచి తోసేసి పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ బి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులు నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన బండారు ఏడుకొండలు, శివరాత్రి నాగేంద్రబాబు, జెట్టిపాటి నాగరాజు, శివరాత్రి కొండలు, జెట్టిపాటి శ్రీనులను చిలకలూరిపేట మండలం కావూరు వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.16వేలు నగదు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై పలు దోపిడీ, దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తిని కాపాడిన పోలీసులు



బాపట్ల టౌన్: అలల ఉధృతికి వ్యక్తి గల్లంతవడంతో వెంటనే పోలీసులు, ఈతగాళ్లు స్పందించి కాపాడారు. ఈ ఘటన మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దయాకర్ మహేష్ కుటుంబ సభ్యులతో మంగళవారం సూర్యలంక సముద్ర తీరానికి వచ్చారు. అందరూ స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా ఎగిసి పడిన అలల తీవ్రతకు ఆయన సముద్రంలో కొట్టుకుపోయారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు సముద్రంలోకి వెళ్లి మహేష్‌ను కాపాడి తీరానికి తీసుకొచ్చారు. తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడిన వారిని స్థానికులు అభినందించారు. మహేష్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్

మంగళగిరి: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీ సర్కిల్ తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన గుంటూరులో ఇండియా పోస్ట్ రన్ 2024ను నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ పోస్టు మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఈ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆవరణలో పోస్టర్, టీషర్ట్‌లను ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆమెకిచ్చిన నగదు తిరిగి 'రాధిక'!

- భూసమస్యల పరిష్కారం పేరిట రైతుల నుంచి వసూలు
- వీఆర్వో బదిలీతో వెలుగు చూసిన అవినీతి వ్యవహారం

మార్టూరు: ఇటీవల వరకు మండలంలోని ఓ గ్రామంలో వీఆర్వోగా పని చేసిన మహిళా అధికారి బదిలీ కావడంతో ఆ గ్రామానికి చెందిన కొందరు బాధిత రైతులు ఆందోళనలు చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ద్రోణాదుల గ్రామంతోపాటు గతంలో మార్టూరుకు కూడా ఓ మహిళా వీఆర్ఓ కొంతకాలం ఇన్‌చార్జిగా బాధ్యతలు చూశారు. అప్పట్లో మార్టూరు వీఆర్ఓగా పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. స్థానిక నాగరాజుపల్లి సెంటర్లోని ఓ కిరాణా వ్యాపారికి అవసరమైన ఎండార్స్‌మెంట్ సర్టిఫికెట్ నిమిత్తం స్థానిక వీఆర్ఏతో కలిసి ఆమె స్వయంగా అర్జీదారు నుంచి రూ. 17 వేల నగదు వసూలు చేస్తున్న వీడియో ప్రస్తుతం స్థానికంగా చక్కర్లు కొట్టడం గమనార్హం.

రెండో చోట్లా వసూళ్లు

ద్రోణాదుల వీఆర్వోగా ఇటీవల వరకు పనిచేసిన ఆమె అదే గ్రామానికి చెందిన వీఆర్ఏతో కలిసి స్థానిక రైతుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ప్రస్తుతం వెల్లువెత్తుతున్నాయి. ద్రోణాదుల గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ సమస్యలను అవకాశంగా తీసుకుని సుమారు 10 నుంచి 15 మంది రైతుల నుంచి నగదు తీసుకున్నట్లు తెలిసింది. ఇలా ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు సుమారు రూ.1.50 లక్షలు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. కానీ ఆ పనులు పూర్తి చేయకుండా వెళ్లిపోవడంతో ప్రస్తుతం విషయం వెలుగు చూసింది. ద్రోణాదుల గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధితోపాటు మరో ప్రభుత్వ ఉద్యోగి సైతం ఈమె బాధితుల చిట్టాలో ఉన్నారంటే ఈమె వసూళ్ల స్థాయిని అర్థం చేసుకోవచ్చు. ఆమె పూర్వం పనిచేసిన మండలానికే తిరిగి బదిలీపై వెళ్లిపోవడంతో స్థానిక బాధిత రైతులు వీఆర్ఏపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. డబ్బు పోయి, తమ రెవెన్యూ సమస్యలు అలాగే మిగిలిపోవడంతో బాధిత రైతులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తమలో తాము మదనపడుతున్నారు.

హోంగార్డులు అభినందనీయులు

- మృతి చెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కులు పంపిణీ
- ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి రూ.5 లక్షల చెక్కు
- జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



మృతిచెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన, బాధపడుతున్న సహోద్యోగుల కుటుంబాలకు సహాయం చేసేందుకు తమ ఒక్కరోజు వేతనాన్ని అందించిన హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కొంతకాలంగా పూజారిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు శివ కామేశ్వరరావుకి రూ.5లక్షలు, నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మల్లికార్జునరావు కుటుంబ సభ్యులకు మరో రూ.5లక్షల చెక్కు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్వీ శ్రీనివాసరావుకు రూ.5లక్షల చెక్కు అందజేశారు. వారి జీవితం నిండునూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

నాటకరంగ దార్శనికుడు ఏఆర్ కృష్ణ

ఏఆర్ కృష్ణ అవార్డు గ్రహీత డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి



డాక్టర్ డీఎస్ఎన్ మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: నాటకరంగ దార్శనికుడు పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ అని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, అధ్యాపకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అన్నారు. తెలుగు నాటక రంగంలో ప్రారంభించినవన్నీ కొనసాగితే ఇప్పుడు తెలుగు నాటకం జాతీయస్థాయిలో అగ్రగామిగా ఉండేదని అభిప్రాయపడ్డారు. కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త నిర్వహణలో చతుర్థ జాతీయస్థాయి పద్యనాటక, సాంఘిక నాటక / నాటికల పోటీలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద గంగోత్రి వ్యవస్థాపకుడు జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని డాక్టర్ డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ మూర్తి మాట్లాడుతూ.. భారత ప్రతినిధిగా ఏఆర్ కృష్ణ చైనా, దక్షిణాఫ్రికా మినహా ప్రపంచమంతా పర్యటించినట్టు చెప్పారు. ప్రతి నాటక సమాజం చేతిలో అయిదారు నాటకాలు ఉండాలని, ఏదైనా ఊరిలో వరసగా పదిరోజులు వాటిని ప్రదర్శించాలని చెప్పారు. నాటకంలోని అన్ని శాఖలలో 'ప్రొఫెషనల్ పెర్ఫార్మెన్స్' ఉంటేనే థియేటర్ అవుతుందని, లేకుంటే కేవలం డ్రామాగానే మిగిలిపోతుందని ఏఆర్ కృష్ణ చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. అజోవిభోకందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్ఎన్ మూర్తితో తన అనుబంధాన్ని వివరించారు. మూర్తికి నాటకమే జీవితమన్నారు. నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ.. తెలుగు నాటకరంగం డాక్టర్ మూర్తికి రుణపడి ఉందన్నారు. 1885లో కందుకూరి 'వ్యవహార ధర్మప్రబోధిని' మొదలు అప్పటి వరకు వచ్చిన 'రుద్రవీణ' వరకు ఎప్పటికప్పటి ఆహార్యం, రంగాలంకరణతో 3.10 గంటలసేపు ప్రదర్శించి అపూర్వ ప్రయోగం చేశారని చెప్పారు. సభాధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ.. సంగీత, నాటక అకాడమీల పునరుద్ధరణకు కృషి చేస్తామని చెప్పారు. కళలకాణాచి వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి మాధవ్ బుర్రా ప్రసంగిస్తూ.. ఏఆర్ కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి పేరిట జాతీయ రంగస్థల పురస్కారాలను ప్రదానం చేయటం తమ అదృష్టమన్నారు. ఉత్సవాల్లో ప్రదర్శిస్తున్న నాటకాల సంపుటి 'విపంచి', ఏఐఆర్ విశ్రాంత డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు రచన 'రంగవీక్షణం' పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో మొదలైన సభ ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ వందన సమర్పణతో ముగిసింది.

మార్కెట్‌లోకి నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ నూతన ఉత్పాదనలు



గ్లాంజ్ మందును ఆవిష్కరిస్తున్న నాట్కో కంపెనీ ప్రతినిధులు

కొరిటిపాడు(గుంటూరు): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదనలను మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. 'గ్లాంజ్', 'బోస్‌నెట్' శిలీంద్ర నాశినులు (తెగుళ్ల మందులు), నాట్‌నెక్స్ కీటకనాశిని (పురుగుల మందు)లను స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ చెబియం మాట్లాడుతూ.. తమ విస్తృత శ్రేణి ఉత్పత్తుల్లో ఒకటైన గ్లాంజ్‌ను వివిధ పంటలలో సమర్థంగా వ్యాధి నియంత్రణకు రూపొందించామని తెలిపారు. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన పద్ధతులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంపొందించాలనే తపనతో తాము వీటిని తెచ్చామని వివరించారు. రైతులను ఆదుకోవడమే తమ లక్ష్యం అని చెప్పారు. జాతీయ సేల్స్, మార్కెటింగ్ హెడ్ సార నర్సయ్య మాట్లాడుతూ.. గ్లాంజ్ మందు వరిలో మానిపండు, కాటుక, గోధుమ రంగు మచ్చ తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. టమాటాలో ఆకుమాడు, మినుములో సెర్కోస్పోరా మచ్చ, మిరపలో బూడిద, ఆల్టర్నేరియా ఆకుమచ్చ, పక్షికన్ను, పత్తిలో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగుళ్లను నివారిస్తుందని వివరించారు. బోస్‌నెట్ కూడా వివిధ పంటలలో బూడిద, మచ్చల తెగుళ్లను నివారిస్తుందన్నారు. నాట్‌నెక్స్ వివిధ పంటలలో కాయతొలుచు పురుగు, నల్లి (కింద ముడత) నివారణను ఉపకరిస్తుందని వివరించారు. కార్యక్రమంలో కంపెనీ జడ్ఎం సౌత్ సేల్స్ అండ్ మార్కెటింగ్ రామిశెట్టి మాలకొండయ్య, ఏపీ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగ ప్రతినిధి గోపు అజయ్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన నాట్కో డిస్ట్రిబ్యూటర్లు, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

నగరంపాలెం: మహిళపై గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి ఇరవై ఏళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.66 వేల వంతున జరిమానా, బంగారం కొనుగోలు చేసిన వ్యక్తికి మూడేళ్ల శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 సెప్టెంబర్ 8న రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన దంపతులు మేడికొండూరు పీఎస్ పరిధిలో ఓ కార్యక్రమానికి వెళ్లి బైకుపై ఇంటికెళ్తున్నారు. పాలడుగు మీదుగా వెళ్తుండగా రహదారికి అడ్డుగా దుండగులు పెద్ద కర్ర వేశారు. దీంతో ఇద్దరూ ఆగారు. ఈలోగా చెట్టు చాటున దాగి ఉన్న నలుగురు హఠాత్తుగా వచ్చారు. మరణాయుధాలు చూపి, భర్తపై దాడికి పాల్పడ్డారు. బనియన్, డ్రాయర్‌పై ఉంచి కాళ్లు, చేతులు కట్టేశారు. ఆమెను సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆమె నుంచి బంగారు, వెండి నగలు, కొంత నగదు లాక్కొని పరారయ్యారు. బాధితురాలు మేడికొండూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కె.మారుతీకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు. కర్నూలు జిల్లా నంద్యాల టౌన్‌కు చెందిన ఆకుల లింగయ్య, గడివేముల మండలం అంబావరం గ్రామ వాసి దాసరి ఓబులేసులను అరెస్ట్ చేశారు. నిందితుడైన ఓ మైనర్‌ను జువైనల్ కోర్టుకు పంపించారు. ప్రస్తుతం ఒకరు పరారీలో ఉన్నారు. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో లింగయ్య, ఓబులేసులకు ఇరవై ఏళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్ష, రూ.66 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. వారి నుంచి బంగారం కొనుగోలు చేసిన కర్నూలు జిల్లా నంద్యాల టౌన్ వాసి రమణకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఏపీపీ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించగా, అప్పటి సీఐ కె.మారుతీకృష్ణ కేసు దర్యాప్తు చేశారు.

విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: బీ ఫార్మసీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ సీఐ ఎం.వీరయ్య ఈ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. వారి కథనం మేరకు.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు సమీపంలోని ఓ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతున్నారు. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున స్నేహితుడితో అతడి ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కాఫీ తాగేందుకు వెళ్లారు. తిరిగి తన రూము వద్దకు అతడు తీసుకెళుతున్న సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి నంబరు ప్లేట్ లేని బైకుపై వచ్చి పోలీసునంటూ భయపెట్టాడు. అనంతరం ఆ యువతిని ఎక్కించుకుని ఆమె స్నేహితుడిని తన వెనుక రావాలని పేర్కొన్నాడు. బస్టాండ్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలతోపాటు లాలాపేట పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. తాను చెప్పినట్లు వినకపోతే స్టేషన్ లోపలికి తీసుకెళతానని భయపెట్టాడు. వారు భయపడటంతో రూము వద్దకు తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో కొత్తపేట వద్ద స్నేహితుడి బైక్‌లో ఇంధనం అయిపోయింది. విద్యార్థినిని ఆ దుండగుడు బుచ్చయ్యతోటలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రెండు అంతస్తుల బిల్డింగ్ వరండాలోకి తీసుకెళ్లి కొట్టి బెదిరించాడు. ఆపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత ఆమెను రూము వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీనిపై స్నేహితుడి సాయంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన పోతినేని గోపి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మంగళవారం న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పలు చోరీ కేసుల్లో అతడు ఇప్పటికే నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్ఐ డి.రమేష్, ఏఎస్ఐ ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, బిక్షం, కోటేశ్వరరావు, పోతురాజు, హోంగార్డు షరీఫ్‌లను డీఎస్పీ అజీజ్ అభినందించారు.

బాపట్లలో విద్యుత్తు అధికారుల తనిఖీలు

బాపట్ల టౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ జి. ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 2,941 సర్వీస్‌లను తనిఖీ చేయగా.. 69 అదనపు లోడ్‌తో ఉన్నట్లు గుర్తించారు. దీంతో రూ. 3.85 లక్షల జరిమానా విధించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన సిబ్బంది 38 బృందాలుగా ఈ దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం జరిగినా, అక్రమంగా కనెక్షన్ తీసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ ఈఈ టి. శ్రీనివాస్, ఏడీఏ పి.వి. మల్లికార్జునరావు, ఏఈలు సాయి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న అంతరిక్ష వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ఫెయిర్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు, వీడియో ప్రొగ్రామ్‌ల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాలలోని ఎస్ఈసీ, ఈసీఈ బ్లాక్‌ల్లో ఏర్పాటుచేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం విగ్రహాన్ని షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదురై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం స్వస్థలమైన రామేశ్వరానికి చెందిన తాను, తన చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గెస్ట్‌లెక్చర్‌లో పాల్గొన్నారు. చంద్రయాన్–1,2,3లో ఇస్రో బృందం ఎదుర్కొన్న సమస్యలను తెలియజేశారు.